క్లుప్తంగా

హ్యాండ్‌లూమ్ పార్కుకు స్థల పరిశీలన



తాడేపల్లిరూరల్: 365 రోజులు నేతన్నలకు పని కల్పించడమే లక్ష్యంగా మంగళగిరిలో మెగా హ్యాండ్‌లూమ్ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. బుధవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆటోనగర్ వద్ద 10.80 ఎకరాల్లో మెగా హ్యాండ్‌లూమ్ పార్క్ ఏర్పాటు చేసేందుకు ఆ శాఖ కమిషనర్ రేఖారాణితో కలసి స్థలాన్ని పరిశీలించారు. మంగళగిరిలోని ఆటోనగర్‌లో మెగా హ్యాండ్‌లూమ్ పార్క్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చర్యలు చేపట్టారని మంత్రి తెలిపారు.

పెదపాలెంలో మేరీమాత మహోత్సవం

అంగరంగ వైభవంగా తేరు ప్రదక్షిణ



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెంలో యేసు తిరు హృదయ దేవాలయం ఆర్‌సీఎం చర్చిలో మేరీమాత మహోత్సవం సందర్భంగా తేరు ప్రదక్షిణ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఫాదర్ జోసఫ్ ప్రభుకుమార్, ఫాదర్ జోసఫ్ రెడ్డి, నూతక్కి విచారణ గురువు మందా ఆంథోని రాజు ఆధ్వర్యంలో దివ్య బలిపూజ నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు భారీగా విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఆర్‌సీఎం చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై మేరీమాతను ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సంఘ పెద్దలు విన్సెంట్ పాల్,సభ్యులు పాల్గొన్నారు.

వ్యాపారులందరూ.. ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణ పరిధిలోని చిరు వ్యాపారులందరూ వెంటనే ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. మారీసుపేటలో బుధవారం తెల్లవారుజామున ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరిగే పారిశుధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే వ్యాపారులందరితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవటం వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పక్కా గృహం మంజూరుకు కృషి చేస్తాం



అమృతలూరు (కొల్లూరు) : అగ్ని ప్రమాదంలో దగ్ధమైన గృహం స్థానంలో పక్కా గృహం మంజూరుకు కృషి చేస్తామని ఎంపీడీఓ మారుతి శేషమాంబ అన్నారు. మండలంలోని ఇంటూరులో ఇటీవల దగ్ధమైన తాళ్లపల్లి సీతారామయ్య గృహాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్ని ప్రమాదం కారణంగా గృహం కోల్పోయి నిర్వాసితులైన బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయం అందించడంతోపాటు, పక్కా గృహం మంజూరుకు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు.

రామాయణం భారతీయులందరికీ ఆదర్శం

నగరం: రామాయణం భారతీయులందరికీ ఆదర్శమని సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకర్రావు చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో మండలంలోని పెద్దవరం గౌడపాలెం రామమందిరంలో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీరాముని జీవితం భారతీయులకు ఆదర్శ మని అందుకే గ్రామగ్రామాన రామాలయాలు నిర్మించుకుని సీతారామ కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలుత గ్రామ పురవీధులలో గోవింద నామ సంకీర్తన చేశారు. కార్యక్రమంలో జిల్లా దేవాలయ ప్రముఖ సత్యనారయణ, వెంకటేశ్వరావు, సాంబయ్య, మురళీకృష్ణ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో ట్రా'ఫికర్'!

- ఇరుకైన రోడ్లతో ఇక్కట్లు
- రోడ్లపై అడ్డదిడ్డ పార్కింగ్‌తో పరేషాన్
- వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం



గుంటూరు - కర్నూలు రాష్ట్ర రహదారిలో ఫిరంగిపురం వద్ద స్తంభించిన ట్రాఫిక్

ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలకేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జటిలమవుతోంది. నిత్యం రద్దీగా ప్రధాన రహదారి మీదుగా భారీ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని సమయాల్లో నడిచేందుకు వీలులేకుండా రోడ్ల పక్కనున్న దుకాణాల ముందు వాహనాలు నిలిపివేస్తున్నారు.

ఇరుకు రోడ్లతో ఇక్కట్లు..

గ్రామంలో రోడ్లు బాగా ఇరుకుగా మారాయి. దుకాణాలు ముందు ఎక్కువ స్థలం లేకపోవడంతో దుకాణాలకు వచ్చే వాహనదారులు తమ వాహనాలు రోడ్లపైనే అడ్డంగా పెడుతున్నారు. దీంతో రోడ్లు మూసుకుపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. హోటళ్లు, సరుకుల, మందుల, వస్త్రదుకాణాల ముందు కొన్ని సమయాల్లో వినియోగదారులు ఎక్కువగా ఉండి వాహనాల రద్దీతో ప్రజలకు ఇక్కట్లు తప్పని పరిస్థితి ఏర్పడింది. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, సత్తెనపల్లి రోడ్డు సెంటర్, పకోడీ కొట్ల సెంటర్, సొలస బస్టాండు సెంటర్లలో సాయంత్రం సమయాల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది.

ఇష్టానుసారంగా పార్కింగ్..

ప్రధాన సెంటర్లలో తోపుడు బండ్లు ఉంటుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. నిత్యం ఈరహదారిపై వందలాది లారీలు, బస్సులు, స్కూల్ బస్సులు, ఆటోలు, ప్రైవేటు వాహనాలు ప్రయాణిస్తుంటాయి. దీంతో పాదచారులు, ద్విచక్రవాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. పెరుగుతున్న వాహనాలకు తగ్గట్లుగా రోడ్డు లేకపోవడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు పార్కు చేసేందుకు సరైన స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలు పార్క్ చేసి వెళుతున్నారు. ఇటీవల ఓ లారీ అదుపుతప్పి దుకాణాల వద్దనున్న ద్విచక్రవాహనాలను ఢీకొట్టుకుంటూ వెళ్లి విద్యుత్‌స్థంభాన్ని ఢీకొన్న సంఘటన చోటుచేసుకుంది. ఆ ప్రదేశంలో ప్రజలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది.



సొలస సెంటర్‌లో రోడ్డుపైనే అడ్డదిడ్డంగా పార్కింగ్

ప్రమాదకరంగా డివైడర్లు..

దీనికితోడు రోడ్డు మధ్యలో ఎత్తు తక్కువలో డివైడర్లు ఉండటంతో రాత్రిళ్లు సరిగా కన్పించక తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఎన్నో వాహనాలు ప్రమాదాలకు గురై వాహనాలు పూర్తిగా దెబ్బతింటుండంతో వాహన యజమానులు ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నారు. డివైడర్లు ఉండటంతో వాహనాల రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడుతోందని వాహన యజమానులు చెబుతున్నారు. ఇప్పటికైన పోలీసులు స్పందించి రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తొలగించేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన సెంటర్లలో ఇబ్బందులు



గ్రామంలోని ప్రధాన సెంటర్లలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో ప్రజలు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ అధికంగా ఉండటంతో వాహనాలపై ప్రయాణించాలంటే కష్టంగా మారింది.

– కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, ఫిరంగిపురం

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి



ప్రధాన కూడళ్లలో ఒక్కోసారి రద్దీ ఎక్కువగా ఉంటుంది. దుకాణానికి సరుకులు తీసుకు వెళ్లేందుకు బైక్‌పై వెళ్లినా పార్కింగ్‌కు ఇబ్బందిగా ఉంటుంది. బస్సు ఆగిందంటే వెనకనే అనేక వాహనాలు నిలిచిపోతున్నాయి. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

– డి.మణిశంకర్, ఫిరంగిపురం

సమస్యను పరిష్కరిస్తాం..



గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో పోలీసులను నియమించి ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తున్నాం. డివైడర్ల వద్ద జరుగుతున్న ప్రమాదాలు అరికట్టేందుకు కృషిచేస్తున్నాం. ప్రజలు, వాహనదారులు సహకరిస్తే ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

– రవీంద్రబాబు, ఫిరంగిపురం సీఐ

2 నుంచి దత్తాత్రేయస్వామి పీఠం వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని శ్రీదత్త పీఠం ఆధ్వర్యంలో పీఠం వార్షికోత్సవం 2,3,4 తేదీల్లో నిర్వహించనున్నట్లు పీఠం నిర్వాహకులు జయశంకర్ బుధవారం తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా మహాచండీహవనం, సాయంత్రం 7గంటలకు మహారుద్రాభిషేకం వేదపండితులచే నిర్వహిస్తామన్నారు. 3న ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం శ్రీచక్రస్నానం, సుదర్శన హవనం ఉంటుందన్నారు. 4న దత్తాత్రేయ హవనం, ప్రత్యేక పూజలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని మిద్దె సెంటర్‌లో ఉన్న ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కంటి వైద్యుడు డాక్టర్ సులేమాన్ ఆధునిక కంప్యూటర్‌పై పరీక్షలు నిర్వహించారు. సుమారు 100 మందికి పైగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచిత కళ్లజోళ్లను అందజేశారు. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ ఆడిట్ హెడ్ అఖిల్, టెరిటరీ మేనేజర్ ప్రదీప్, మంగళగిరి బ్రాంచ్ మేనేజర్ దీప్తి, అసిస్టెంట్ మేనేజర్ తిరుమలేశ్వరరావు, బ్రాంచి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు

తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని పరిష్కరించాలని ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు అన్నారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మిక పోరాట సాధన కన్వీనర్ కూరపాటి స్టీవెన్ అధ్యక్షతన ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు, సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావులు సందర్శించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నారా లోకేష్ ఏసీసీ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని మంత్రి నిలబెట్టుకోవాలన్నారు. కోర్టు తీర్పు ప్రకారం ఏసీసీ ఆస్తులను పాడుకున్నారో వారే కార్మికులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16వ తేదీ ఆల్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులతో సభను ఏర్పాటు చేసి, పోరాటం ఉధృతం చేస్తామని స్టీవెన్ హెచ్చరించారు. ఏఐటీయూసీ నాయకులు కంచర్ల కాశయ్య, ఐఎన్‌టీయూసీ నాయకుడు డి.శామ్యూల్, ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.కోటేశ్వరరావు, కె.ఆదినారాయణ, బి.అంకయ్య, ఆశీర్వాదం, నాగేశ్వరరావు, శారమ్మ, వేముల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు



వేములూరిపాడులో పశువైద్యశిబిరం ప్రారంభిస్తున్న వైద్యులు, నాయకులు



తుళ్లూరులో నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్య సహాయ సంచాలకులు ఎ.మురళీకృష్ణ

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లో బుధవారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈశిబిరాలను గ్రామ నాయకులు ప్రారంభించారు. వేములూరిపాడు గ్రామంలో జరిగిన శిబిరంలో 80 పశువులకు అమీనాబాద్‌లో 50 దూడలకు నట్టల నివారణ మందు వేసినట్లు పశువైద్యాధికారి షేక్ పీర్ అహ్మద్ తెలిపారు. అంతేకాక 24 పశువులకు గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు చెప్పారు. వేములూరిపాడులో 327 జీవాలకు షీప్ వ్యాక్సిన్ వేశామన్నారు. పాడి రైతులు శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులు గురించి వివరించారు. కటికల రామ కోటేశ్వరరావు, జెట్టి సుమన్, కోడూరి సదాశివరావు, భీమనాథుని శ్రీనివాసరావు, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తుళ్లూరులో...

తాడికొండ: బుధవారం మండల కేంద్రమైన తుళ్లూరులో నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 315 పశువులు, 71 లేగ దూడలు, 756 గొర్రెలు, మేకలకు నట్టల నివారణా మందులు పంపిణీ చేయగా 350 కోళ్లకు వ్యాక్సిన్‌లు అందజేశారు. పశువైద్య సంచాలకులు ఎ.మురళీ కృష్ణ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభించి వైద్య సేవలు అందజేశారు. అసిస్టెంట్ సర్జన్ ప్రవీణ్, ఎల్ఎస్ఏ మంత్రు నాయక్, వై.కిషోర్, గోపాల మిత్రలు సుబ్బారావు, బి.రాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు దామినేని శ్రీనివాసరావు, బండ్ల పట్టాభిరామయ్య, జమ్ముల అనీల్, హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భౌభౌలతో బెంబేలు

సైకిళ్లు, బైక్‌లపై వెళ్లే వారి వెంటపడి కరుస్తున్న శునకాలు



తాడికొండలో రాత్రిళ్లు ద్విచక్ర వాహనదారుల పైకి వెళుతున్న గ్రామ సింహాలు

తాడికొండ: నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలో గ్రామ సింహాల గర్జనతో జనాలు బెంబేలెత్తుతున్నారు. వీటి ఏరివేతకు మార్గదర్శకాలు అడ్డుగా వచ్చి తమకు న్యాయపరమైన ఇబ్బందులు వస్తున్నాయంటూ ఇటీవల కాలంలో గ్రామ పంచాయతీ అధికారులు చేతులెత్తేయడంతో శునక మహారాజాలకు ఎదురు లేకుండా పోయింది. ఎక్కడ చూసినా పగలు, రాత్రి తేడా లేకుండా గుంపులు గుంపులుగా తిరుగుతూ ఒంటరిగా వస్తున్న వాహనదారులు, చిన్నారులే టార్గెట్‌గా పరుగులు పెట్టిస్తున్నాయి. చీకటి పడితే ఇక ప్రధాన రహదారులే వాటి అడ్డాగా మారాయంటే అతిశయోక్తి లేదు. గుంపులు, గుంపులుగా రోడ్లపైకి చేరి ఆటుగా వచ్చే వాహనదారుల వెంట పరుగులు తీస్తూ వెంటాడి కరుస్తున్నాయి. శునకాలను పట్టుకునేందుకు పంచాయతీలు అంతగా ఆసక్తి చూపించిన దాఖలాలు లేకపోవడంతో గత కొన్ని సంవత్సరాలుగా వీటి సంఖ్య భారీగా పెరిగిపోయింది. రోడ్లపై గుంపులు గుంపులుగా సంచరిస్తూ బెంబేలెత్తిస్తున్నాయి. అధికారులు ఇకనైనా స్పందించి తగిన చర్యలు తీసుకొని గ్రామ సింహాల(కుక్కల) బెడదకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

భట్టిప్రోలు (కొల్లూరు) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న ఆర్థిక భారాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న సీపీఎం 27వ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జి.సుధాకర్ కోరారు. బుధవారం స్థానిక రథం సెంటర్‌లో మహాసభ పోస్టర్లను స్థానిక నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు నెల్లూరులో జరగనున్న రాష్ట్ర మహాసభలలో ప్రజా పోరాటాలపై ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చే విధంగా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రజా ఉద్యమాల కోసం జరుగుతున్న మహాసభలకు ప్రజలు తరలిరావాలని కోరారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు మురుగుడు సత్యనారాయణ, గోళ్ల నాగరాజు పాల్గొన్నారు.

2న చిర్రావూరులో వైద్యశిబిరం

తాడేపల్లిరూరల్: ఫిబ్రవరి 2వ తేదీన చిర్రావూరు గ్రామంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీన చిర్రావూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నామని, ఈ శిబిరంలో జనరల్ వైద్యులు డాక్టర్ నిఖిల్, డాక్టర్ జి.శశిధర్, కీళ్లు, ఎముకల వైద్యులు డాక్టర్ కడియాల జయకృష్ణ, గైనకాలజీ వైద్యులు డాక్టర్ జాస్తి, చర్మ వైద్యులు డాక్టర్ అర్చన మాధురి, దంత వైద్యులు డాక్టర్ కె.శ్రీకర్, ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ ఎస్కే వహీద్, లక్ష్మి కంటి పరీక్షా కేంద్రం వైద్యులు, ఫిజియో థెరపీ వైద్యులు డాక్టర్ బాషా వెల్నెస్ కోచ్ దుర్గా కుమారి వైద్యసేవలను అందించనున్నారని, వైద్యుల సలహామేరకు షుగర్, బీపీ, టూడీ ఎకో, ఈసీజీ, బోన్ మినరల్ డెన్సిటీ, అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేయబడతామని, ఉచితంగా మందులు అందజేయబడతామని చిర్రావూరు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వంగర సురేష్ ఆ ప్రకటనలో కోరారు.

ఇరువురిపై కేసు నమోదు

తాడికొండ: అక్రమంగా భూ స్వాధీనం, బెదిరింపులు, దాడి వ్యవహారంలో ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. వివరాల ప్రకారం తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన అనమర్లపూడి శేషగిరిరావు తనకున్న 0.64 సెంట్ల భూమిని నిడమర్రు గ్రామానికి చెందిన తాడిబోయిన గోపయ్య వద్ద రిజిస్ట్రేషన్ చేసి రూ.30 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఇందుకు గాను వడ్డీతో సహా నగదు తిరిగి చెల్లించిన తర్వాత మళ్లీ భూమి ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నాడు. అయితే అప్పుగా ఇచ్చిన నగదు తిరిగి చెల్లించినప్పటికీ తాడిబోయిన గోపయ్య భూమిని తిరిగి ఇవ్వడానికి నిరాకరించడంతో పాటు దురుసుగా ప్రవర్తించి ఆయన కుమారుడితో కలిసి అసభ్య పదజాలంతో దూషించి, బెదిరించి దాడి చేశారు. కంతేరు శివారులో జరిగిన ఈ దాడిపై బాధితుడు శేషగిరిరావు తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ జోజి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జూదరులు అరెస్ట్

కొల్లిపర: మండల పరిధిలోని పాతబొమ్మువానిపాలెం గ్రామంలో బుధవారం పంట పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు కొల్లిపర ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి 6810, నాలుగు బైకులు సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట కానిస్టేబుల్ కూర్మారావు, అశోక్ ఉన్నారు.

స్వాలోయింగ్ రుగ్మతను పరిష్కరించిన మణిపాల్ వైద్యులు



ఆపరేషన్ చేసిన డాక్టర్ బత్తిన రాజేష్

తాడేపల్లిరూరల్: 86 ఏళ్ల వ్యక్తికి మణిపాల్ హాస్పిటల్ వైద్యులు స్వాలోయింగ్ రుగ్మతను బుధవారం విజయవంతంగా పరిష్కరించారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు మణిపాల్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మణిపాల్ హాస్పిటల్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ 86 సంవత్సరాల రోగిలో పీఓఈఎం విధానం ద్వారా అకలేసియా కార్డియా వంటి సంక్లిష్ట సమస్యను విజయవంతంగా పరిష్కరించామన్నారు. రోగికి చేసిన పరీక్షలలో ఆహారం అన్నవాహికలో ఇరుక్కుని ఉన్నట్లు తేలిందని, క్యాన్సర్ సంకేతాలు లేవని తెలిసిందన్నారు. హై రిజల్యూషన్ ఎసాఫాజియల్ మానోమెట్రీ ద్వారా పరీక్షలలో ఆయనకు అకలేసియా కార్డియా ఉందని నిర్ధారించామని తెలిపారు. మణిపాల్ మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీలో కన్సలెంట్లు అయిన డాక్టర్ బత్తి రాజేష్, డాక్టర్ రాజేష్ చంద్ర శస్త్రచికిత్సను నిర్వహించారని తెలిపారు. ఈ ప్రక్రియకు దాదాపు గంట సమయం పట్టిందని, ఎటువంటి సమస్యలు లేకుండా శస్త్రచికిత్స పూర్తి అయిందని, శస్త్ర చికిత్స తర్వాత రోగిని ఒక రోజుపాటు నోటి ద్వారా ఎటువంటి ఆహారం తీసుకోకుండా ఉంచామని, తరువాత క్రమంగా ద్రవాలు, మెత్తటి ఆహారానికి మార్చామని, అనంతరం డిశ్చార్జి చేశామని తెలిపారు.

సీపీఎం జాతాను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం.రవి, వెంకటేశ్వర్లు

తాడేపల్లిరూరల్: రాజధాని నిర్మాణం, రాష్ట్ర అభివృద్ధి నినాదంతో ఫిబ్రవరి 1,2,3 తేదీలలో నెల్లూరు జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రవి, బూరుగ వెంకటేశ్వరరావులు పిలుపునిచ్చారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేక అమరారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మహాసభల నేపథ్యంలో గురువారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి పట్టణంలోని నెహ్రూ బొమ్మసెంటర్ వద్ద నుంచి సీపీఎం జాత ప్రారంభమై తాడేపల్లి నుంచి మంగళగిరి, తుళ్లూరు, తాడికొండ, పెదకాకాని మీదుగా గుంటూరు చేరుతుందన్నారు. అనంతరం శుక్రవారం నారా కోడూరు, తెనాలి, పొన్నూరు, బాపట్ల నుంచి చీరాల, ఒంగోలు మీదుగా నెల్లూరు మహాసభ వద్దకు చేరుకుంటుందని తెలిపారు. ఈ మహాసభకు పార్టీ అఖిల భారత నాయకులు బృందా కరత్, ఎంఏ బేబి, బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి తదితరులు పాల్గొంటారన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు జొన్న శివశంకరావు, తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, మండల పట్టణ నాయకులు దర్శనపు విజయ్‌బాబు, నీరుడు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

తెనాలి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు

తెనాలిఅర్బన్: ఐటీఐ పూర్తిచేసి పాలిటెక్నిక్ డిప్లొమా రెండవ సంవత్సరంలో నేరుగా చేరదలచిన విద్యార్థుల కోసం బ్రిడ్జి కోర్సును నిర్వహించనున్నట్లు తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, వాటి జిరాక్స్ కాపీలతో ఫిబ్రవరి 1వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 9014491772, 9347795839 నెంబర్‌లలో సంప్రదించాలన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

తెనాలి రూరల్: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుగ్గిరాల, చిలువూరు స్టేషన్ల మధ్య మంచికలపూడి రైల్వే గేటు సమీపంలో సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హ్యాండ్ బాల్ పోటీలకు తెనాలి క్రీడాకారులు

తెనాలిఅర్బన్: జాతీయ హ్యాండ్ బాల్ పోటీలకు తెనాలి డబుల్ హార్స్ ఫౌండేషన్‌కు చెందిన జనార్ధన్‌రెడ్డి, కల్యాణ్‌లు ఎంపికైనట్లు కోచ్ నాగరాజు బుధ వారం తెలిపారు. ఉత్తరాఖండ్‌లో జరనున్న జాతీయ పోటీలలో వీరు పాల్గొంటారని చెప్పారు. వీరిని డబుల్ హార్స్ ఫౌండేషన్ నిర్వాహకులు, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర రావులు అభినందించారు.

చికిత్స పొందుతూ యువతి మృతి



మాలతి (ఫైల్)

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువతులు తీవ్రంగా గాయపడగా, ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. పట్టణ నాజరుపేటకు చెందిన రమ్య, మల్లెపాడుకు చెందిన చిలుమూరి మాలతి (22) గుంటూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ప్రతి రోజు యాక్టివాపై వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో ఈ నెల 27వ తేదీ రాత్రి విధులు ముగించుకుని తిరిగి వస్తుండగా తెనాలి మండలం సంగం జాగర్లమూడి, అంగలకుదురు గ్రామాల మధ్య ఎదురుగా పల్సర్ బైక్‌పై వచ్చిన చేబ్రోలు మండలం శలపాడుకు చెందిన వ్యక్తి వీరి వాహనాన్ని వేగంగా ఢీకొట్టాడు. ఘటనలో ఇద్దరు యువతులు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను వడ్లమూడి సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, అక్కడ నుంచి తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. మాలతి పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు సమగ్ర వైద్యశాలకు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించగా, సాయంతరం మల్లెపాడులో అంత్యక్రియలు నిర్వహించారు.